క్లుప్తంగా

ఏఓపై విచారణ
నవాబుపేట: మండల వ్యవసాయాధికారిపై గురువారం ఏడీఏ మాధవి విచారణ చేశారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన విచారణలో పలువురితో సమాచారం సేకరించారు. ఇటీవల ఎరువుల పంపిణీ విషయంలో క్యూలైన్లు కొనసాగుతుండగా ఒక రిపోర్టర్ వీడియోలు తీస్తూ రైతులను రెచ్చగొట్టాడంటూ మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ అతన్ని దూషించినట్లు ఆరోపించారు. ఈ విషయంలో బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తరుణంలో తాజాగా విచారణ జరిపినట్లు ఏడీఏ తెలిపారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం
చిన్నచింతకుంట: భర్తతో గొడవపడి తన ముగ్గురు పిల్లలతో కలిసి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పూజ తన భర్త నాగమునితో కొంతకాలంగా గొడవ పడుతుండేది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా పరిష్కారం లభించలేదు. దీంతో బుధవారం పూజ ఎవరికి చెప్పకుండా కూతురు దీపిక, కుమారులు ఆదిత్య, నందులతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తమ బంధువులతో వెతికినా కనిపించలేదు. దీంతో గురువారం కుటుంబ సభ్యులు చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు.

పీయూ రిజిస్ట్రార్‌కు వినతి


మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గతంలో ఏర్పాటు చేసిన కార్యవర్గాన్ని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రిజిస్ట్రార్ రమేష్ బాబుకు పలువురు నాన్‌టీచింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. గతంలో ఏర్పాటు చేసిన కార్యవర్గం చురుకుగా పనిచేయడం లేదని, సంఘంలో అంతర్గత విభేదాలు తలెత్తాయని, పై అధికారులతో సభ్యుల దురుసుగా ప్రవర్తించడం, వ్యక్తిగతంలో బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, సంతోష్, సూర్య, బలీక్ పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం
స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామయి బాబా మందిరంలోని లయన్ భవన్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, సుప్రభాత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అనిల్‌కుమార్ శిబిరంలో వైద్య సేవలు అందించారు.

క్లాస్‌మెంట్స్ ఆర్థిక సాయం
మిడ్జిల్: మండల కేంద్రంలో కమ్మరి లలిత అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో ఈ విషయం తెలుసుకున్న 2003–2004 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు గురువారం రూ.33,500 నగదు అందజేశారు. అవసరమైతే మరింత సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

రేషన్ కార్డుల అందజేత
దేవరకద్ర రూరల్: బల్సుపల్లిలో లబ్ధిదారులకు గురువారం ఆర్‌ఐ శరత్ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శంకర్, అంజి, హన్మంతు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ
గండేడ్: కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రోగులకు, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సల్కర్‌పేట్ గిరిజన మినీగురుకులంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

కందూర్‌లో వైద్య శిబిరం
అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో గురువారం అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, క్షయ నివారణ అధికారి మల్లికార్జున్ ఆదేశాలతో టీబీ, హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. క్షయ వ్యాధి అనుమానితులు, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి డాక్టర్లు ముదస్సిర్ హుస్సేన్, ప్రవళికలు పరీక్షలు చేశారు.

రిటైర్డు టీచర్లకు సన్మానం


స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక టీచర్స్ కాలనీలోని రాజరాజేశ్వరి దేవాలయం (షిరిడీసాయిమందిరం)లో గురువందన్–ఛాత్ర అభినందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ రిటైర్డ్ టీచర్లు భాగ్యవతమ్మ, హెచ్‌వై పద్మావతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వి.మనోహర్‌రెడ్డి, బీవీపీ పాలమూరుశాఖ అధ్యక్షుడు భూషణ్‌పాండే, ప్రాంత సలహాదారు పాండురంగం పాల్గొన్నారు.

‘ఆన్‌లైన్’తో డుమ్మాలకు చెక్

- ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ సిస్టం
- పర్యవేక్షణ–సమయపాలన మెరుగు
- పాటించనున్న ఉపాధ్యాయులు
- సర్వర్ సమస్యతో కొన్ని ఇబ్బందులు



ఎఫ్‌ఆర్‌ఎస్‌లో భాగంగా సెల్‌ఫోన్‌లో ఉపాధ్యాయురాలి ముఖం గుర్తిస్తున్న మరో ఉపాధ్యాయురాలు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పారదర్శకత పెంచేందుకు, విధులకు ఆలస్యంగా రావటం, డుమ్మాలు కొట్టే ఉపాధ్యాయులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆగస్టు 1నుంచి ఫేస్ రికగ్నేషన్ విధానాన్ని ప్రారంభించిన మొదటి రోజు ప్రతి ఉపాధ్యాయుడు తాను పనిచేస్తున్న పాఠశాలలో మొబైల్ ఫోన్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని జీపీఎస్ అనుసంధానం చేసుకున్నారు. ఆగస్టు 2 నుంచి అన్ని పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమల్లోకి వచ్చింది. ఇప్పటికే విద్యార్థులకు ఆన్‌లైన్ హాజరు ఉండగా, ఇకపై ఉపాధ్యాయులకు సైతం అమలు చేస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లి అక్కడి నుంచే ఉదయం 9గంటలకు జియో కో ఆర్డినేట్ అటెండెన్స్‌లో భాగంగా హాజరు వేసుకుంటూ లాగిన్ కావాల్సి ఉంటుంది. తిరిగి సాయంత్రం బడి నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు లాగ్‌అవుట్ కావాలి. దీనివల్ల ఇకపై ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లటంతో పాటు సమయ పాలన పాటించాల్సిన పరిస్థితి కల్పించారు.

17 మండలాల్లో 804 పాఠశాలల్లో అమలు..

మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాలు, 3 మున్సిపాలిటీల్లోని 804 పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేస్తున్నారు. పై పాఠశాలల్లో మొత్తం 8,164 మంది ఉపాధ్యాయులు, 63,545 మంది విద్యార్థులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ద్వారా హాజరు వేస్తున్నారు.

ఏమిటి ఎఫ్‌ఆర్‌ఎస్: ప్రతి ఉపాధ్యాయుడు తాను పనిచేస్తున్న పాఠశాల వద్ద నుంచి మొబైల్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. పనిచేస్తున్న ప్రాంతానికి జీపీఎస్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా పాఠశాలలో సెల్‌ఫోన్‌లో ఉన్న యాప్ ద్వారా తన ముఖం గుర్తింపుతో హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లో వ్యక్తి ముఖాన్ని గుర్తించి వివరాలను తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది. జీపీఎస్ అనుసంధానం కలిగి ఉండటం వల్ల పాఠశాలకు రాకుండా హాజరు వేసుకోవటానికి ఆస్కారం లేదు. ఎవరైనా ఉపాధ్యాయుడు అలా హాజరు వేసేందుకు యత్నించినప్పటికి సాధ్యం కాదు. ఎందుకంటే ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకున్న యాప్‌లో గ్రామానికి చెందిన లాంగిట్యూడ్, ల్యాటిట్యూడ్ ఆధారంగా జీపీఎస్ అనుసంధానం చేసుకోవటమే. దీనిద్వారా పాఠశాల విద్యాశాఖ అభివృద్ధి చేసిన ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వ్యవస్థ ద్వారా ఉపాధ్యాయులపై పర్యవేక్షణ పెరుగుతుంది.

మారుమూల గ్రామాల్లో సర్వర్ సమస్య

కొన్ని మారుమూల గ్రామాల్లో ఎఫ్‌ఆర్‌ఎస్‌కు సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎంతగా ప్రయత్నించినా నిర్ణీత సమయానికి హాజరు వేసుకోలేక పోతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు. యాప్‌ను పూర్తిగా అభివృద్ధి చేసి గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాక అమలు చేస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

పర్యవేక్షణ పెరుగుతుంది..



ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ద్వారా ఉపాధ్యాయుల సమ య పాలనపై పర్యవేక్షణ పెరుగుతుంది. ఉన్నతాధికారులు సైతం ఉపాధ్యాయుల సమయపాలన గూర్చి ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేసే అవకాశం ఉంది. తద్వారా ఉపాధ్యాయుల్లోనూ బాధ్యత పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అయ్యేందుకు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ఉపయోగపడుతుంది. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేస్తున్నాం. మండలంలోని 100 పాఠశాలల్లోనూ అమలు చేస్తున్నాం.

– మంజులాదేవి, ఎంఈఓ, జడ్చర్ల

సర్వర్ సమస్యలు..



ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో సర్వర్ సమస్య, సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎంత ప్రయత్నించినా సమయానికి హాజరు పడటం లేదు. మా తోటి ఉపాధ్యాయుడు లాగిన్ అయి హాజరు వేసుకున్నా అది రికార్డు కాకపోవటంతో మళ్లీ లాగిన్ అయ్యేందుకు ప్రయత్నింగా, లాగ్‌అవుట్ చూయించింది. అంటే ఉపాధ్యాయుడు బడిలోనే ఉన్నప్పటికి హాజరు పడలేదు. ఇలాంటి సమస్యలు పరిష్కరించి అమలు చేస్తే బాగుంటుంది.

– యలకంటి భాస్కర్, ఈర్లపల్లితండా

వస్పుల పాఠశాలలో అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

మిడ్జిల్: మండల పరిధిలోని వస్పుల ఉన్నత పాఠశాలలో పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి పాఠశాల హెచ్‌ఎం ఖాతాలో డబ్బులు జమ చేయగా, గత మార్చి నెలలో సంబంధిత హెచ్‌ఎం కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకుండా తన సొంత ఖాతాలో జమ చేసుకోగా, ఆ విషయం బుధవారం సాక్షిలో వార్త ప్రచురణ అయ్యింది. దీంతో గురువారం జిల్లా విద్యాశాఖ అధికారులు కమలేశ్వర్‌రావు, యాదగిరి, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3.30 వరకు విచారణ చేపట్టారు. అధికారులు విచారణ చేపట్టడంతో డబ్బులు వాడుకున్న హెచ్‌ఎం వెంకటయ్య, తన భార్య లక్ష్మి పేరిట ఉన్న చెక్‌ను కాంట్రాక్టర్ నంద్యాల విజేందర్‌రెడ్డి పేరిట రూ.లక్ష 49వేల 669 చెక్‌ను అందజేశారు. పాఠశాలలో జరిగిన అన్ని అంశాలను డీఈఓకు నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు. డబ్బులు వాడుకున్న హెచ్‌ఎంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

బాలికల హాస్టల్ సందర్శించిన మున్సిపల్ కమిషనర్



రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని టీడబ్ల్యూ కళాశాల బాలికల హాస్టల్‌ను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి గురువారం సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన హాస్టల్‌లో వంటగదులు, సామగ్రి, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. శానిటేషన్ గూర్చి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో భోజన వసతులు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. వేడినీటి కోసం గ్లీజర్ కావాలని విద్యార్థులు కమిషనర్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్లీజర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు వార్డెన్ శారద ఉన్నారు.

వైభవంగా రక్షాబంధన్ వేడుకలు



దేవరకద్రలో రక్షబంధన్ కడుతున్న బాలికలు



గండేడ్‌లో రాఖీలు చూపుతున్న విద్యార్థులు

దేవరకద్ర /దేవరకద్ర రూరల్: సోదరి–సోదరుల అనుబంధానికి ప్రతీక రక్షబంధన్ వేడుకలు గురువారం లక్ష్మిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. మిఠాయిలు తినిపించుకొని రాఖీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేవరకద్రలో పలు పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

గండేడ్: రక్షాబంధన్ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్ పేర్కొన్నారు. గండేడ్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అధికారుల సూచనల మేరకు సాగు చేయాలి
మహమ్మదాబాద్: ఎన్నో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోకుండా రైతులు అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని రూరల్ వ్యవసాయాధికారి రాంపాల్ తెలిపారు. గురువారం మండలంలోని మొకర్లాబాద్, మహమ్మదాబాద్ గ్రామాల్లో వరినాట్లు వేస్తున్న రైతుల పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సూచనలు సలహాల మేరకు పంటలు సాగు చేయాలని రోగాల బారిన పడిన పంటలకు సూచించిన మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేందర్, ఏఈఓలు పాల్గొన్నారు.

20వ వార్డులో చైర్‌పర్సన్ పర్యటన


జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డిలు గురువారం పర్యటించారు. వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు అన్ని పరిశుభ్రం చేయిస్తామని, అందుకోసం వారం రోజుల వ్యవధి కావాలన్నారు. వారి సందర్శనలో కాలనీవాసులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు


జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరివాడ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ శోభారాణి పాల్గొని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత వివరించారు. బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, తద్వారా బిడ్డకు అంటురోగాలు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కుమ్మరి రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు అంజనమ్మ, ఆయా రమాదేవి పాల్గొన్నారు.

రుణాల రికవరీ వందశాతం ఉండాలి
నవాబుపేట: మహిళా సంఘాల లోన్ రికవరీ వందశాతం ఉండాలని ఏపీఎం శ్రీహరి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ మండల అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు లోన్ చెల్లించి నూతన రుణాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న తాజా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి జ్యోతి, కార్యదర్శి జ్యోతి, సీసీలు కాంచన, రమాదేవి, బాల్‌రాజ్ ఉన్నారు.

ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో వీడ్కోలు సమావేశం
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సులువుగా పొందేందుకు ఆస్కారం ఉందన్నారు. జీవితంలో ఎదగాలంటే కష్టపడి చదవాలని సూచించారు.

పోచమ్మ విగ్రహం ఊరేగింపు


చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం తిర్మలాపురంలో పోచమ్మ విగ్రహాన్ని గురువారం గ్రామ పురవీధుల్లో పోతురాజుల ఆటపాటల మధ్య ఘనంగా నిర్వహించారు. పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గురు, శుక్రవారం జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమంలో వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో పాలమూరు ఫార్మసీ హబ్‌గా మారిందని, ఫార్మసీ పూర్తి చేసిన వెంటనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కంట్రోలర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ రవికాంత్, ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే
మిడ్జిల్: మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఒకేషనల్ కళాశాలలో గురువారం జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులు డ్యాన్స్‌లు చేసి అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పండగ సాయన్న జయంతి
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పండగ సాయన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కళాశాల ఎదుట సాయన్న చిత్రపటానికి బీసీ సంఘం నాయకులు, అధ్యాపకులు నివాళులర్పించారు. అధ్యాపకుడు కుమారస్వామి మాట్లాడుతూ చరిత్ర విస్మరించిన వీరుడు పండగ సాయన్న అని, జమిందారి, జాగిర్దారి, రాజాకర్ల పెత్తందార్లకు తనదైన శైలీలో బుద్ధిచెప్పిన బహుజన బాంధవుడని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు గాలెన్న, లా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ భూమయ్య, రవీందర్, పర్వతాలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్


జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో గల ఎస్‌వీకేఎం స్కూల్‌లో గురువారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా ప్రక్రియ కొనసాగింది. పోలింగ్‌కు ఓటర్లు బారులు తీరి క్రమశిక్షణతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమాన్ని ఎస్‌ఎంఐఎంఎస్ అసోసియేట్ డీన్ డాక్టర్ విద్య, ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎబినేజర్, విద్యారాఘవన్ లు పర్యవేక్షించారు.

అటవీసంపదను కాపాడుకోవాలి



మొక్కలను పరిశీలిస్తున్న అటవీశాఖ జోగుళాంబ జోన్ అధికారి శివాల రాంబాబు

మహమ్మదాబాద్: అటవీ సంపదను కంటికి రెప్పలా కాపాడుకోవాలని జోగుళాంబ జోన్ అటవీశాఖ అధికారి శివాల రాంబాబు తెలిపారు. గురువారం మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలోని కొండాపూర్, జూలపల్లి సెక్షన్‌లో నర్సరీలను పరిశీలించి అక్కడ నాటిన మొక్కలను చూశారు. ఈ సందర్భంగా ఆయన మహమ్మదాబాద్‌రేంజ్ పరిధిలో ఎన్ని మొక్కలు నాటారు, ఏ స్థాయిలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మూడు సెక్షన్ల పరిధిలో 30 హెక్టార్లలో మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. అటవీ పరిధి నుంచి ఎలాంటి కలప, ఇసుక ఇతర సంపద తరలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొండాపూర్ సెక్షన్ పరిధిలో ఎన్ని ఎకరాల్లో పాడైన చెట్లు తొలగించారు, వాటి స్థానంలో మొక్కలు నాటారా లేదా అని పరిశీలించారు. ఇటీవల రేంజ్ పరిధిలో చిరుత సంచారం చేస్తున్నట్లు వార్తలు వచ్చినందున చిరుత సంచారం ఏమైనా ఉన్నదా? అని ఆరా తీశారు. ఆయన వెంట డీఎఫ్‌ఓ సత్యనారాయణ, రేంజ్ అధికారి అబ్దుల్‌హై, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు ఉన్నారు.

ఆలస్యంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



మిడ్జిల్ పాఠశాలలో వంట చేసే ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతున్న మండల అధికారులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఆలస్యమైంది. మధ్యాహ్న భోజన బిల్లులు రావడం లేదని మహిళలు రెండు నెలలుగా గుడ్లు పెట్టడం మానివేశారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి ఏజెన్సీ మహిళలను ప్రశ్నించగా, ఐదు నెలలుగా బిల్లులు రావడం లేదని సమాధానం ఇచ్చారు. దీంతో 12 గంటల వరకు బియ్యం ఇవ్వక పోవడంతో వంట సిద్ధం చేయలేదు. దీంతో 2 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సాయిలక్ష్మి, గ్రామ పెద్దలు వెంకటయ్య, శంకర్, రామ్‌గౌడ్ పాఠశాలకు వెళ్లి ఏజెన్సీ మహిళతో మాట్లాడి నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. డబ్బులు ఎక్కడికి పోవని, బిల్లులు వస్తాయని అధికారులు తెలిపారు. నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు.

బీసీలపై కాంగ్రెస్‌ది సవతితల్లి ప్రేమ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రభాకర్

మెట్టుగడ్డ: బీసీలపై మరోసారి కాంగ్రెసు ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తూ మోసపూరిత వైఖరి అవలంభిస్తోందని బీసీ మేధావుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ ప్రభాకర్ ఆరోపించారు. బీసీ మేధావుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ బీసీలకు 42శాతం హామీ ఏమైందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందంత ఆశలతో ఢిల్లీ వెళ్లి బీసీల కోసం ధర్నా చేస్తే వారి అధినాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ లు కనీసం ధర్నా వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే రిజర్వేషన్ల పట్ల వారి చిత్తశుద్ధి ఏందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. బీజేపీ బీసీ ఎంపీలు లోక్‌సభలో కాని, రాజ్యసభలో కాని గళమెత్తకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీసీ మహిళలు లక్ష్మి, మాధవి, భాగ్యలక్ష్మి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ

నవాబుపేట: వైద్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ సూచించారు. గురువారం లింగంపల్లి, గుబ్బడిగుచ్చతండాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తండాలో ఇటీవల డెంగీతో ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరిగే నులిపురుగుల నివారణ కార్యక్రమంలో మాత్రల పంపిణీపై ఆరా తీశారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని ఆయన సూచించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఎంపీహెచ్‌ఓ సుభాష్‌చంద్రబోస్, సూపర్ వైజర్ శ్రీనివాస్, భవానిసింగ్ ఉన్నారు.

సెప్టెంబర్ 1న మహాధర్నా



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షుడు అత్తర్ అహ్మద్, శశిధర్, పురుషోత్తంగౌడ్, శ్రీకాంత్, యాదయ్య, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీపై అవగాహన
జడ్చర్ల టౌన్: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎన్‌డీడీ మాత్రల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ మంజులాదేవి, మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ప్రతాప్‌చౌహాన్, అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి మనుప్రియ హాజరయ్యారు.

గండేడ్: పిల్లలో ఉండే నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు.

డెంగీ బాధితులకు పరామర్శ


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో రోజురోజుకూ డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా గురువారం కుమ్మరివాడి, పరిమళగిరిలో ఒక్కో కేసు నమోదు కావడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇళ్లు నాణ్యతగా నిర్మించాలి
మహమ్మదాబాద్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని గృహనిర్మాణశాఖ ఏఈ జశ్వంత్ తెలిపారు. గురువారం మండలంలోని నంచర్ల, మహమ్మదాబాద్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేస్తే బిల్లులు త్వరగా చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

ఏబీఏఎస్ విధానం తొలగించాలి
పాలమూరు: జిల్లాలో ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన ఏబీఏఎస్ విధానాన్ని తొలగించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణకు గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఉద్యోగ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఆరోగ్యశాఖలో 90శాతం మంది మహిళాఉద్యోగులు ఉన్నారని, 24గంటల అత్యవసర పరిస్థితుల్లో అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ పనులు చేయాల్సి వస్తుందని తెలిపారు.

మాడరేషన్ విధానం రద్దు చేయాలి
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో నిర్వహిస్తున్న రికార్డుల మాడరేషన్ విధానం రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీయూ వీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒకేరోజు సుమారు 2వేలకు పైగా రికార్డులను కొన్ని గంటల్లో ఎలా మాడరేషన్ నిర్వహిస్తారని, ర్యాండమ్‌గా రికార్డులను పరిశీలించి ఆ మార్కులను అందరి విద్యార్థులకు ఆపాదించడం వల్ల ప్రతిభ గల విద్యార్థులు నష్టపోతున్నారన్నారు.

బీసీ క్రిమిలేయర్‌ను..



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ రిజర్వేషన్ క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. గోవా రాష్ట్రంలో 10వ నేషనల్ కన్వెన్షన్ రాష్ట్రీయ ఓబీసీ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను 5 శాతానికి కుదించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఓబీసీ మహాసభలో బీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, కార్యదర్శి రమ, బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, శ్రీనివాసులు, మహేంద్రసాగర్ పాల్గొన్నారు.